శవ పంచాయతీ జరుగుతోన్నట్లుగా వుంది వాతావరణం.

ధర్మయ్య ముఖం ముడుచుకుని కూర్చున్నాడు. అతనికి కొంచెం దూరంలో కూర్చునుంది పుల్లమ్మ. ఆమె ముఖంలో దుఃఖమే ఎక్కువగా కనిపిస్తోంది. కళ్ళల్లో, పెదవుల్లో, చెంపల్లో, నుదుటిపైనా, కనుబొమల కదలికల్లో అంతా దుఃఖమే! ఆ దుఃఖానికి వెనుకవున్న ఆరాటం, ఆవేదన వెనుక కోపం కూడా మండుతోంది.

జ్ఞాతులైపోయారిపుడు.

'అన్నా!' దీనంగా పిలిచింది పుల్లమ్మ. ఆమెకి తన ఒక్కగానొక్క కొడుకు, తన చేతుల్లో పెరిగి, తన ఒడిలో పడుకుని, తన ఆడుపాళ్ళల్లో మెదలి, కాస్త బుద్ధిజ్ఞానం తెచ్చుకున్న తన కొడుకు యీనాడు ఆస్తి పంచి యిమ్మనటం గుండెల్లో ఎర్రగా కాలే యినుప గడ్డపార దించినట్లుగా వుంది. 'ఇది వాడి బుద్ధి కాదన్నా! అంతా దాని మాయమాటలు. అది జగజ్జంత్రీ! నా కొడుకుని ఎరవను

# అనుబంధం

యామినీ సరస్వతి



'నువ్వు ఎంత గింజుకున్నా లాభం లేదే! రామన్న ఏరుబోవాలనుకున్నాడు, వాడు యింకేం చెప్పినా వినడు. వాడు బుద్ధి మార్చుకున్నాడు!' అన్నాడు తండ్రీకొడుకుల మధ్య మధ్యవర్తిత్వం నెరపి, పెద్దరికంగా వేర్పాట్లు పెట్టాలని వచ్చిన నారాయణ.

నారాయణ ధర్మయ్యకి బావమరిది వరస. ఎక్కడిదో దూరపు బంధువు. పుల్లమ్మ నాయనకో, కేజినాయనకో నారాయణ వాళ్లతో మట్టరికం దాయాదులల్లా

చేసి ఆడిస్తున్నది. నాతో ఏరుపడి నా కొడుకును గొడ్డును దోలకపోయినట్లు తోలకపోతున్నది!' ఆ తర్వాత ఆమెకి నోటమాట పెగల్లేదు. దుఃఖంతో గొంతు పూడుకపోయింది.

'పుల్లీ! ఏమిటే నీ పిచ్చి! వాళ్ళు ఎక్కడికి పోతున్నారు. ఇదే యింట్లో దడి గట్టుకుని వుంటా మంటున్నారు. అంతే గదా! ఊరు విడిచి పోతున్నారా? వాడిచి పోతున్నారా? యాడికి పోతారు? ఏదో పిల్లలు ఎవరి కుండ, ఎవరి పొంత

వాళ్ళ కుండాలనుకున్నారు. కాలం మారి పోతున్నాది అది వాళ్ళ తప్పుగాదు.'

చివ్వున తలెత్తాడు ధర్మయ్య.

ఆ చూపుల నెదుర్కోలేవి నారాయణ ముఖం అటుతిప్పుకుని బీడి ముట్టించుకునే ప్రయత్నంలో వుండిపోయాడు.

'నారాయణా!'

'ఏం బావా! అగ్గిపుల్ల ఆర్పేసి యిటు తిరిగాడు. 'చేతిలో అగ్గుంది. ధర్మ దేవత! నాకేం బయం!' అనుకున్నా డతను.

"నువ్వు వెయ్యి జెప్పు, లచ్చ జెప్పు, నేను ఆస్తి పంచియ్యను. మా తాత ఆస్తి పంచుకోలా! మా నాయన ఆస్తి పంచుకోలా! నేను పంచుకోలా! ఇప్పుడు ఈ పిల్లనాయాలు నాతో ఆస్తి పంచుకుంటాడా! ఊహూఁ పంచియ్యను. ఏం చేస్తాడో చూస్తా. ఎవరు జెప్పుతారో జూస్తా!'

'ధర్మయ్య బావా!' బీడీ దమ్ము పీల్చి, విదల్చి మళ్ళీ అన్నాడు. "నువ్వు నలుగురికి న్యాయం జెప్పేటోడివి! అసలు నీ పేల్లోనే ధర్మం వుంది. నువ్వొకరితో జెప్పించుకోవాలా! పిల్లగాడు ఆ మోజులో వుండాడు. నువ్వు రాజీన యియ్యకపోతే కోర్టుకే పోతాడు. అంతే!"

ధరయ్య గుండె జల్లుమంది. 'తన కొడుకు కోర్టుకు పోతాడా! ఓరి దేవుడా! ఇంకేవుంది! ఒద్దెన పీడర్లు బాగుపడుతారు. తన్నెడతాడు, వాడు చెడతాడు, ఊహూఁ' అనుకున్నాడు.

పుల్లమ్మ ఆశ్చర్యంతో గుడ్లెళ్ళబెట్టింది. 'ఏందేందీ! కోర్టుకుపోతాడా! ఎల్లమనెల్లమను. ఎల్లెచ్చనోల్లంతా ఏం జొర్రుతున్నారో వాకు తెలియదేం! అందరూ భోంచేసినోళ్ళే! నోట్లో ఏలేసుకుని రావాల మల్లా.'

'బావా యిదిగో! యీ యిరుద్దం మాటలెంటుగ్గాని! ఆస్తి వాటికిపంచియ్యి!' నలుగుర్లో సెబాసనిపించుకో. అంతే!' అన్నాడు నారాయణ లెస్తూ.

'అన్నా!' దీనంగా పిలిచింది పుల్లమ్మ. "నా మాటిను! దాంతో చెప్పి సూడు. ఇంటి పెత్తనం దాన్నే కట్టుకు నూరేగమను! నాకేం అక్కర్లా! వాడ్ని మాత్రం వాళ్ళ నాయన మాటినమను. మాకేం మల్లా? మాన్యాలా! పి వుంది! ఈ కొంప! ఆ ఎకరం మాగాని! అరెకరం మెట్ట! అంతే గదా! అదయినా మేం సంపాయిచ్చుకుంధే గాని మా మామిచ్చి పోయింది గాదు! పాడిగొడ్లు నాలుగున్నాయి! ఒట్టి గొడ్లు రెండున్నాయి! మూడు మేకలు, ఒక దున్నపోతు వుంది. కొడెద్దులున్నాయి- కొడె దూడుంది! ఈ పెత్తనమంతా దాన్నే సెయ్యమను! పాడి దాన్నే సెయ్యమను. నాకేం దర్జాగా వుంటా!

పాలు పెరుగు కోసక తినాత్తే అన్నం దగ్గదా యీ రాద్ధాంతం! నీ మొగుడికి నెయ్యేప్లే నా మొగుడేం

దినాల అన్నందుకు గదా యీ కొట్లాట! టింగురంగా అని వారం వారం సందాలకు సినిమాకు మొగనెంబడి వద్దే అంటే గదా కొంప వగలగొట్టి మంటుండది! యాల్లాటికి ఎన్నిసార్లు సినిమాకు బొయ్యరాలా! రాత్రిరాత్రికి పోయి రెండో ఆట జూసి రాలా? నేను వాళ్ల మామకు జెప్పినానా! వాళ్ల ముకానికి అడ్డమొచ్చినానా? అప్పుడే అడ్డంజెప్పింటే యింత కత అయ్యేదా?

వద్దన్నా వస్తు! పెద్దోళ్లల్లో అవమానం తెచ్చి పెట్టా తలెత్తక తిరగాల! అన్నదమ్ముల్లా వుండుకుంటే నాయం! తండ్రీ కొడుకుల యాడనైనా పంచుకున్నారా?' ఆవేశంతో, ఆక్రోశంతో, ఆరాటంగా రాజా ప్రస్తావన తెచ్చింది పల్లమ్మ.

పెదవి విరుస్తూ నారాయణ 'బావా! పొలిరిగినా పరిస్తితి సమస్య! ఇను మిరిగితే అతకొచ్చు. కాని మనసిరిగితే అతకలేం! అతకంతే! యింగ వదిలెయ్! ఆస్తి పంచు!'

పడగపై దెబ్బతిన్న తాచుపాములా బుసకొట్టాడు ధర్మయ్య. 'సరే! పంచుకోమను!' అన్నాడు.

నారాయణ ముఖం యింతైంది! అతనికి యీ పరిస్థితి చాల సంకటంగా వుంది. 'అటు బావ! యిటు అల్లుడు! ఇద్దరూ ఇద్దరే! ఒకరు పద్దెం అంటే ఇంకొకరు తెద్దెం అంటారు. ఆ తండ్రి కొడుకు కాదూ వాడు!' అనుకున్నాడు. 'సర్లే! ఏమైతేనేం యిప్పటికి వినుకున్నారు బావ!' అని లేచాడు. 'రామన్నని పిలుచుకొస్తా!' అన్నాడు.

'ఇదిగో అన్నా! అట్టనే దాన్ని రమ్మను. నాతో పంచుకుని, మొగుణ్ణి సెప్పుచేతుల్లో పెట్టుకొని రామ రామాంటూ రాజ్జమేలాలని చూస్తంది! చూస్తా! చూస్తా! దీని పబుత్వం ఎన్నాళ్లో!' విధిలేక తన ఆక్రోశం పట్టలేక ఆగ్రహాన్ని మాటల్లో వెళ్లబుచ్చింది పల్లమ్మ.


విసుగ్గా చూశాడు ధర్మయ్య. 'నువ్వూరుకో! అంతా నీ మాదిరే వుంటారనుకుని పొరబడ్డాం! అయినా మనోడు తెలివిగలోడయితే యిట్టెందుకయితాది! మన బంగారం మంచిదయితే కంసలోణ్ణి అనే పనేముంది! మనదే కల్తీ బంగారం!'

మూతి మున్నూరు వంకర్లు తిప్పింది పల్లమ్మ! చూపలేని కోపం తెచ్చిన అశక్తత వలన ఆగ్రహంతో పళ్లు కొరికింది.

* * *

ఇంటి ముందు బండమీద కూర్చుని వున్నాడు రామన్న! వాడి కళ్లు భూమిని చూస్తున్నాయి. వేళ్లు మట్టిలో గీతలు గీస్తున్నాయి. మనసులో ఆలోచనలు సుడిగాలిలో తిరుగుతున్నాయి. మెదడులో ఊహాలు అల్లిబిల్లిగా అల్లుకుంటున్నాయి.

రామన్న పక్కనే కూర్చున్నది సీత! ఆమె రామన్నని పెళ్ళిచేసుకుని




అత్తగారింటికి వచ్చి యింకా ఏడాది నిండలా। ఇంకా కాపురంలోని సుఖం కొత్తకుండలోని నీరులా సుఖంగానే వుంది. భర్తతో రాత్రిళ్లు స్వర్గసుఖంగా కనిపిస్తోన్నా, పగళ్లు మాత్రం నరకం లాగానే వున్నాయి. ఒక సుఖం లేదు। ఒక అచ్చటా లేదు- ముచ్చటా లేదు అందుకే వేరు కాపురం పెట్టే ఆలోచన వచ్చింది ఆమెకు.

ముందుగ రామన్న యీ ఆలోచనకి సుతరామూ యిష్టపడ్లేదు. 'నువ్వు నోర్మూసుకో। మా యమ్మ యింటే గుండెపగిలి సస్తాది? మా నాయన అగ్గి రావుడై పోతాడు। అయినా నీ కిప్పుడేం తక్కువైందని వేరే ఒండుకోవాలి!!' అని కసిరాడు.

సీత సీతమ్మోరైంది. అశోకవనంలో లాగే వరిచేను గట్టునున్న వేపచెట్టు క్రింది తలనున్న నీళ్ల కడవ కళ్లల్లోంచి దింపింది.

పెళ్లయిన యిన్నేళ్లలోనూ భార్య ముఖంలో నవ్వు తప్ప దుఃఖం చూడని రామన్న బెంబేలుపడిపోయాడు. దశకంఠుణ్ణి నాశనం చేసే రీతిలో అన్నాడు 'ఏం జరిగిందే। యేడ్వకుండా చెప్పు'

సీత తన గుండె గుబులు విప్పింది. 'పౌడరు లేదు - స్నో లేదు. కంటికి కాటుక లేదు. షేపు జాకెట్ లేదు చలవ చీర లేదు. మల్లెపూలు లేవు. సినిమాలు లేవు. షికార్లు లేవు తియ్యతియ్యగా మాట్లాడుకోవాలన్నా భయమే। మొగుడికి వారంవారం తలంటుపొయ్యటానికి రాత్రిళ్లు అన్నంలో పాలుపోసుకోడానికి లేదు. పగలు పెరుగు వేసుకోటానికి లేదు. నేమ్మచక్క అమ్ముకోటానికి తప్ప

అన్నంలోకి కాదు - ఒకటా రెండా ఎన్ని బాధలు?

తను శిరువెళ్లలో ఎంత సుఖ పడింది. వారంవారం సంతలో ఎన్నెన్ని కొనుక్కుంది. ఎన్ని సినిమాలు చూసింది. అసలు తన భాషకి వీళ్ల భాషకీ ఎంత తేడా? తను నాలుగు పాసైంది. ఆఖరికి మొగుడు ఒకటి కూడా చదవలేదన్నా - వాడి రూపం చూసి యిష్టపడి పెళ్ళిచేసు కుంది.

ఏం లాభం? సుఖం లేకపోయినాక బతికేం లాభం?

పెళ్లయిన కొత్తలోనే గదా ఆలు మొగులు నాగేశ్వరరావు-వాణిశ్రీ లాగ బతకాల్సింది. నాలుగేళ్లు సంసారం జేసి పిల్లాపాపా పుట్టుకొస్తే సంసారంలో ఏం సుఖం వుంటుంది. గుమ్మడి, అంజలి లాగా చూస్తా వూరుకోవాలి. అంతే గదా! వీరుబోతే మనం ఎట్టా బతకాలు?

రాత్రికి 'రుస్కోపులో' రంగు రంగుల బొమ్మ చూసినట్టయింది.

అగ్గిపుల్ల గీశాడు పేడు కారానికి.

'రామన్నా' నారాయణ పిలిచాడు అల్లుగిని.

రామన్న తలెత్తాడు.

'మీ నాయన పేడబోసికి ఒప్పు కున్నాడు లోపలికి రా! సీతా! నువ్వూ రాయే తల్లీ! మీ అత్తమ్మ ఇన్నూ రమ్మంది! సమంగా పంచు కోండి!'

'అన్నీ విన్నానే చిన్నాయనా! మా అత్తమ్మ మాటలన్నీ విన్నా! వన్నుసురు బోసుకుంటే లాభం ఏముంది!' అంది సీత.

అంతా లోపలికి వెళ్లేరు. లోపలికి వచ్చిన సీతను చూపుతో భస్మంచేసేలా చూసింది పుల్లమ్మ. కొడుకు వైపు జాలిగా చూసింది 'ఎత్తిముండాకొడకా! నువ్వు పెండ్లాంమాటలు యిని ఏరు బోతావా! పో! పో! నువ్వేం సుగ పడతావో నే చూస్తా! అయినా యిదంతా ఎవరికోసం సంపాయించి నాంరా! మాకేం పడిమంది కొడుకు లున్నారా! నువ్వొకక్కడివే గదా! మా తర్వాత అస్తంతా నీదే గదా? అడ పిల్లలకి పెట్టి సస్తామనుకునీకి నువ్వొ కక్కడివే పుట్టివిగదరా, ఎనకా ముందూ ఎవర్లేకుండా ఒంటిలింగం మాదిరి! ఏం మనిషివిరా నువ్వు!' అనుకుంది పుల్లమ్మ

ధర్మయ్య కొడుకువైపు ఒకమాపు మాశాడు.

అది చూసిన రామన్న తలవంచు కున్నాడు.

'బావా! నువ్వు పెద్దోడివి! ధర్మం, న్యాయం తెలిసినోడివి నువ్వే చెప్పు. నువ్వంతా బాగానే సెప్టా. సిన్నోడు గాబట్టి అడుకోసటాడు శ్రీకృష్ణుదే దుర్యోధనుడికి చెప్పినాడు. రాయబారం సూళ్లా! బాలునికి కోరుకోనికి చాన్సి

య్యాల! అంతే!' అన్నాడు నారాయణ.

తలూపేడు ధర్మయ్య.

* * *

'చెరొక ఎద్దు తీసుకుంటాం....వాడి యిష్టం.... దేన్నయినా తోలుకోమను. కోడెని వాడికే యిస్తాలే....నేను దున్నపోతు నుంచుకుంటా. మేకలు చెరొకటి తీసుకుంటాం. తల్లి ఎవరు దీసుకుంటే దానిపిల్ల వాల్లకే! తల్లీ పిల్లల్ని ఎందుకు విడదియ్యాల. ఏజన్మలో పాపంజేసినో్న-యియాల కొడుకుతో విరుపడతన్నా! పాడెనుములు చెర్రెండు తీసుకుంటాం. ఎద్దైనవి రెండున్నాయి చెరోటి తీసుకుంటాం!'

ధర్మయ్య చెప్పినట్లుగానే వాటిని నిలబెట్టారు. రామన్న తను కోరుకుని బాగం తీసుకుని ఒక పక్కగా తోలుకున్నాడు.

'ఇల్లు రెండు బాగాలు చేస్తాం! పెద్దాడివి నేను పడమటి యేపుంటాను. వాడు తూర్పు దిక్కు తీసుకోమను. ఇల్లు కూడా ఆ పక్కనే బాగుంది. ఎప్పుడు కట్టిందో యిది! మా తాతే కట్టినాదో-నాయనే కట్టినాడో-నాకు మతికి లేదు. నేను రిపేర్లు జేయించినా. అంతే!'

రామన్న తలూపినాడు.

'ఇదిగో పాత్తర సామాను! వెంబులు, తప్లెలు, గలాసులు, బిందెలు, బోకులు, కుండలు, చాట్లు, పొరకలు, పీటలు అన్నీ యిడియిడిగా పెట్టినా. వాన్నొచ్చి తీసుకోమను. మా తల్లి! ఏ యాలప్పుడు అడుగు బెట్టిందో-సంసారాన్ని రెండు జేస్తుంది! సుకపడమను!' అక్కసు అంతా వెలిగక్కింది పుల్లమ్మ.

సీత నోరెత్తలేదు. ఎలాగూ వేరు పడుతున్నాం. ఇంకా మాటలెందుకు! నోటి తీపి తగ్గడానికా? అనుకుంది.

పాత్రసామాను పంపకం అయింది. పాత పెట్టెలు పంచుకున్నారు. మంచాలు, పరుపులు, దుప్పట్లు, దోమతెరలు, బొంతలు, జంబుకానాలు, కంబళ్లు పంచుకున్నారు. వ్యవసాయం సామాను చెరిసగం చేసి పంచుకున్నారు.

'ఇగింతే! ఇంగేం లేదు!' అన్నాడు ధర్మయ్య.

'నగదు లెక్క లేదా?' మెల్లిగా అడిగాడు నారాయణ.

ఛర్రుమంది ధర్మయ్యకి- చిర్రెత్తుకొచ్చింది. 'ఇదిగో నూరూపాయల నోటు. ఇదీ యిప్పుడుండేది. దీన్ని చెర్సగం చించి!'

'చెరి యాభై!' రెండు నోట్లుగా చేయించి పంచాడు నారాయణ.

'సొమ్మేం లేదా?'

'దాని మెళ్లో తాళిబొట్లు, గుండ్లు, చేళ్లకు కడియాలు, వేళ్లకు ఉంగరాలు, ముక్కుపోగు, నాగరం, వడ్డాణం, పక్కపిన్ను, కాళ్ల గొలుసులు, ఎంతో ఉన్నాయి. సీతమ్మగారు ఉన్నవన్నీ పెండ్లప్పుడే జేయించినా అయ్యే తుకాల్లో! ఎవరి సొమ్ము వాళ్లకే!'

'నాయమే!' అన్నాడు నారాయణ.

రామన్న అంగీకారంగా తలూపేడు.

'చరాస్తి ఉంతేనా?' మళ్లీ అడిగేడు నారాయణ.

'నేనూ నా పెండ్లాం. వాడూ వాడి పెండ్లాం,' ఎద్దేవగా అన్నాడు ధర్మయ్య.

'అది సరే! పంచుకునేటి....'

పెదవి విరిచాడు ధర్మయ్య 'ఇగ లేస్తానా!'

'అస్తో!' అంది సీత

లేడిపైకి దూకే పులిలా చూశాడు. 'అది నా అబ్బసొమ్ము గాదు, నా కష్టార్జితం! రూపాయికి రూపాయి, పైసకి పైస, దమ్మిడీకి దమ్మిడీ కూడబెట్టి సంపాయించి కొనుక్కున్నా. దాన్లో మీకు సెంటు పొలం లేదు. అంతే!' ఖరాకండిగా అన్నాడు ధర్మయ్య.

'ఇదేం న్యాయం?' అంది సీత

'అయితే! నీ మొగడ్ని అడుగు. నీ పిన్నాయన్నడిగితే చెప్తారు. లేదా పెద్దోళ్ల నడుగు. ఇదిగో నారాయణ! నా దెబ్బ రెండుసార్లు మచ్చిపోయినా నేరొకటి తీసుకుంటాం! గింజెలు, వడ్లు, కందులు, పెసలు కొల్చుకుని పంచమను.'

'అది సరే! అస్తి!!' నసిగేడు నారాయణ.

'సచ్చి పిడికెడు సున్నమయినా సెంటు పొలం యియ్యను. అది నాది నా యిష్టం. నే బతికినన్నాళ్ళు నాది. నే జచ్చినాక నా పెండ్లానికి. ఆ తర్వాత దానిష్టం. మేం ఎవరికయినా యిచ్చుకుంటాం. దేవలోకానికి దానం రాస్తాం. మా తరువాత అది నా వాడికియ్యం. ముందే జెపుతున్నా! మల్లా పేచీపెట్టి లాభం లేదు.'

'కొంచెం ఆలోచించు బావా! ఏదంతా మొండి యవ్వారం! రామన్న ఎవరు? నీ కొడుగ్గాదూ! వాడికిస్తే ఏం తప్పు—'

'నా కొడుగ్గాదు. నా కొడుకయితే యిట్లా పంపకాలు పెట్టమనడు. ఆడెవడో నేనెవరో—'

'రేపు నీకు —'

'సస్తే— కొరివి పెడతాడనా! వద్దు. వాడు కొరివి దెచ్చినా నా దేహం కాలిపోదు. ఎదురుతిరుగుతాది. ఇప్పుడే జెబుతున్నా యిను! వాడికి నాయిన్లేడు. నా కొడుకు లేడు!'

'ఏంది సువ్వు మాటాడేది. వావి సంగతి సర్సుబో! సావులు బతుకులు ఎందుకెంచుకోవాల! శుభమాని మంగళారం పూట ఇగ జాల్లే!' తాళిబొట్టు కళ్ళకద్దుకుంది పుల్లమ్మ.

ధర్మయ్య మాటాళ్లేదు. గుండెల్లో సన్నవి రొద. అది ప్రేమ చేసే చివరి వేదనా రోదన. కసితో కక్కిన విషం.

'ఏంది బావా! పిల్లోనితో పగేంది? వాడెవడు? నీ పేగులో పేగు. వాడు కష్టపడతంటే నువ్వు జూస్తుంటవా? సగభాగం యిచ్చెయ్!'

నారాయణ మాటలు విని గలగల



నవ్వాడు ధర్మయ్య. "ఇది బాగుంది నారాయణా! తగవు జెప్పనీకి విన్నే పిలుకోవాల ఎవడయినా! వాల్చాబ్లే చెప్పొచ్చినావ్! ఇగ నోర్మూసుకో—'

నారాయణ ఇంకేం అన్లేదు.

'మామా!' తొలిసారిగా నోరు విప్పాడు రామన్న. 'నాయన అస్తి కొడుక్కి రాదంటావా? ఇదేనా దరమం? పోన్లే యియ్యకుంటేమానే మేం బతక లేమా? మా రెక్కల కష్టం మాకుంటాది. ఫలానా ధర్మయ్య కొడుకు కూలికి బోతన్నాడంటే ఎవరికి అవమానం? ఇంత అన్నాయంగా పంచినాడని అయన్నే అంటారు.'

'నోర్మూసుకోరా ఎదవ నన్నాసి! పెండ్లాంమాటివి ఏరు బోతన్నావ్? అస్తేం దిరా అస్తి! నా ఎముకలు, రగతం, మాంసం పంచిచ్చినానురా నీకు! నువ్వు నన్ను సీల్చుకుని వచ్చి పుట్టినావురా! ఏందిరా ధర్మం! పొద్దువాటల్లా తన్న నాయాన్ని అమ్మని యిడిసిపోవడం నాయమా? దరమమా? ఏందిరా అవమానం? కొడుకు నాయనతో పంచుకుపోంగా లేనవమానం కూలికి బోతే వస్తాదా? కష్ట పడితే అవమానం రాదురా! దొంగతనం జేస్తే అవమానం! అన్నాయం జేస్తే అవమానంరా! అదీ అవమానం!' కస్సు మన్నాడు ధర్మయ్య.

రామన్న నోరెత్తలేదు.

కొద్దిసేపు గడిచింది భారంగా.

'అయిందయింది. ఇక పగోల్ల మాదిరి వద్దు. పక్కపక్కనే వుంటారు ఎవరి

యింటిలో వాళ్లు చిన్నా మనసిప్పి పలకరించుకోండి. ఎందుకొచ్చిన కోపతాపాలు!' అన్నాడు నారాయణ.

'కుందేరయితే కులమేరయితావని యిన్లేదా నువ్వు! అల్లెవరో మేమెవరో-' అంది నిరాశగా పుల్లమ్మ.

సీత సమాధానం యివ్వలేదు. రామన్న నోరెత్తలేదు. ధర్మయ్య కుయ్ కయ్ అనలేదు. కానీ 'మద్దెన తడకలు గట్టుకోండి' అనివెళ్ళిపోయాడు నారాయణ.

ఇంటి మధ్యభాగంలో దడి వెలసింది కుటుంబాన్నీ, మమతనీ, మమకారాన్నీ చీల్చుతున్నట్టుగా.

* * *

కాలగమనంలో ఆరు నెలలు గడిచాయి లెక్కలు వేస్తే ఆరునెలలే కానీ అనంతమైన కాలగమనంలో ఆరునెలలంటే ఎంత? వంద సంవత్సరాల జీవితకాలంలో ఆరునెలలకి విలువేం వుంది? కానీ జీవితాలని మార్చేసే సంఘటనలు జరిగితే అరక్షణమైనా ఎక్కువైందే!

అదుపూ అజ్జా లేకపోవటం, ఆధారం అంటూ ఒకటి లేకపోవటం, రామన్నని నిర్వ్యాపారుడిని చేసింది. అవి అన్ని అనర్థాలకీ మూలకారణమన్నట్టుగా తయారైంది భార్య పాడిచేసి వంటతో ఇంటితో కుటుంబం జరిగేందుకు తెచ్చేది. ఎంచుకున్న తిండిగింజలు కొన్ని ఉన్నాయి. దాంతో సుఖజీవనానికి అలవాటుపడ్డాడు రామన్న.

సుఖానికి తోడుగా ఎప్పుడూ వ్యసనాలు జతపడతాయి. జతపడ్డాయి కూడా. పేకాట, కోళ్ళపందెంతో మొదలైన వ్యసనం డబ్బు సంపాదనపై మళ్లింది.

అదీ సులువుగా సంపాదించాలి!

'ఎన్నేళ్లు కష్టపడాలి! మా నాయన యాభయ్యేళ్లు కష్టపడితే అరెకరం మెట్ట ఎకరం మాగాని సంపాదించినాడు. నేనూ డు! యాడాది తిరిగేసరికల్లా ఆయన ముగంమీద కొట్టినట్లు సంపాదిస్తా!' అన్నాడు సీతతో.

సీత మురిసిపోయింది భర్త ప్రయోజకత్వానికి ఆనందించింది 'తను తన అత్తకంటే దర్జాగా వుంటాలి! మెడనిండా బంగారం, మేలిరకం చీరలు, పాషన్ జాకెట్లు, నాజూకు తిండి- అన్నీ అనుభవించాల' అనుకుంది.

భర్తని అలరించింది తన అందచందాలతో. తన కడుపులో ఊపిరిపోసుకుంటున్న శిశువు అదృష్టవంతుడు అనుకుంది

'కోడలు నీళ్లోసుకుందంట గదా!' అన్నమాట విని పుల్లమ్మ మనస్సు ఆనందతరంగితమైంది అయితే మరుక్షణం ఆమె మనస్సు మరో విధంగా ఆలోచించింది. 'ఆమెను చూస్తేనే ముఖం తిప్పుకుంటాది. నాన్నెట్లా పలకరించాలి!' అనుకుంది దాంతో ముభావం వహించింది.

ఒకే కప్పుకింద నివసిస్తున్నా, మధ్యన లేచిన దడివల్ల మనసుల్లోనూ గోడలు

లేవాయి. ధర్మయ్యకి తనూ తన పొలం తప్ప మరొకటి అక్కర్లేకపోయింది. కొడుకు వేరుపడ్డాడన్న బాధ ఆయన్ని బాగా బాధించింది. అందుకే కొడుకు విషయం బొత్తిగా పట్టించుకోలేదు అదే ఆ కుటుంబానికి పిడుగుపాటైంది.

సులువుగా డబ్బు సంపాదించాలనుకున్న రామన్న మట్కా జూదానికి మళ్ళాడు. రోజూ రూపాయి అర్ధతో ప్రారంభమైన వాడి వ్యసనం దినదినాభివృద్ధి చెందింది.

* * *

నంద్యాలలో ఒక్క రోజున్నే వెయ్యి రూపాయల బ్రాకెట్ ఆడి అది తన అంచనాలని తలకిందులు చెయ్యగానే భవిష్యత్తంతా అంధకారమైపోయినట్టుగా భయపడ్డాడు రామన్న.

అప్పుడు పుట్టాయి ఆలోచనలు వాడిలో! అప్పులు లెక్కవేసుకున్నాడు. 'అమ్మో!' అనుకున్నాడు. తన తెలివి తక్కువతనం తన అత్యాశ తెలిసొచ్చింది

'ఈ అప్పు తీర్చే దెట్లా!' అదే వాడి గుండెల్లో గుబులుగుబులుగా తిరుగుతోంది. 'ఊహూ! ఇంక లేదు. తనప్పు తీర్చలేడు అని తనతో అయ్యేది ఏమ అయిపోయింది. ఇక చావాలి. అంతే!'

నిర్ణయం తీసుకున్నాడు రామన్న.

* * *

రాత్రి బాగా పన్నెండు గంటల సమయం. ప్రొద్దుటూరికి వచ్చి, భార్య పెట్టిన వేడివేడి అన్నం కడుపునిండా తిని ఆమెతో సుఖంగా గడిపి, ఆమె నిద్రపోయాక తనవెంట తెచ్చుకున్న 'సువాక్రాన్' డబ్బా గబగబ తాగేశాడు రామన్న. 'నే ఛచ్చినా పరవాలేదు. సీత కడుపుతో వుంది. ఈ అప్పులబాధ నాతో తీరిపోతాది. మా నాయన మనవడికి ఆస్తి యిస్తాడు. ఎన్నాళ్లు బతికినా యింతే గదా! యింగేం సుఖం!' అనుకున్నాడు వాడు.

కడుపులో వికారం మొదలైంది.

వాతావరణంలోని వక్రత సీతకి మెలకువ తెచ్చింది.

చప్పున లేచి కూర్చుని వాయురోగం మనిషిలాగా, కలరా సోకినవాడిలాగా బాధపడుతున్న భర్తని, పక్కనే పడివున్న 'సువాక్రాన్' డబ్బాని చూసింది.

అంతే!

కెవ్వున కేక పెట్టింది. 'ఓరినాయనో! ఓరి దేవుడో! అత్తా! మామా! నా మొగుడు మనలని అన్యాయం జేసి పోతున్నాడు. మందు తాగి సస్తన్నాడోయ్.'

కేకలు విన్న ధర్మయ్య చప్పున లేచి కూర్చున్నాడు పెళ్లాం కూడా లేచి కిరసనాయిల్ దీపాన్ని పెద్దదిచేసి తడక వద్దకి వచ్చింది. గళ్ల సందున యమయాతన అనుభవిస్తోన్న కొడుకుని చూసింది.

'సీతమేనే! రాంగాడు ఏదో అగా

యిత్యం చేసినావు!' అంటూ ఏడుస్తూ అటు తిరిగి వచ్చింది ఆమె లోపలికి వెళ్ళి 'ఓరి నాయనో!' అంటూ కోడలితో గొంతు కలిపింది.

అత్తను కౌగిలించుకుని ఏడవ సాగింది సీత.

ధర్మయ్య కూడా వచ్చాడు. ఇరుగూ పొరుగూ వచ్చారు. చికిత్స ప్రారంభమైంది. పత్తిచేనుకు మందులు తెస్తూ ప్రమాదం జరిగితే తాత్కాలికంగా ప్రథమ చికిత్స జరిగేందుకు తెచ్చుకున్న అట్రోపిన్, లాసిక్స్ తీసి ఇంజక్షన్స్ వేయించాడు విశ్వనాధరెడ్డి. ఇంటర్ తప్పి, మరో వ్యాపకం లేక, కాయకష్టం చెయ్యలేక, వైద్యాన్ని వృత్తిగా తీసుకున్న మాలి 'వైద్యం' చేశాడు.

ఎట్లాగైతేనేం రామన్న ప్రాణాలు గట్టివి. ప్రమాదాన్ని దాటాడు.

* * *

వారం రోజులకి తేరుకున్నాడు రామన్న. అప్పట్నుంచి యింట్లో దరి సంధ్య వాకిట దిగనూలేంది. రెండు పంటలు లేవు. కలసి వుండలేకపోయినా కలిసి తింటున్నారు. ఎవరి భాగాల్లో వాళ్లు తల దాచుకుంటున్నారు.

'యాభైవేలు! ఒకటా రెండా! ఎట్లా చేసినాడు అప్పు! ఎవరిమ్మన్నారు? ఎట్లా తీరస్తాడు? సస్తే తీర్తాయా అప్పులు! మొగోడైతే తీర్చాలి. అందుకోసం బతకాలి! తీర్చలేనని బయమా! అట్లా అయితే అప్పుజేసేప్పుడు తెల్దా ఆ సంగతి! మట్టాకు అంటు మట్టాకు! ఈ నా కొడుకు మునాళ్లకోసారి నందాలకు పోయేదింతుకా! అడ్డిలో పడుకుని, హోటల్లో తిని, మట్టాకు అదినా ఎవడిచ్చాడే వానికి అప్పు!' ధర్మయ్య తిట్ల దండకం అందుకున్నాడు.

'ఒకటి నేం! అందరూ యిచ్చినారంట! వెయ్య, అయిదు నూర్లు, రెండువేలు— యాడ దొరికితే అడ! బాండు రాసి తెచ్చినాడంట!'

'నాలిగ్గిసుకోమను. కుంకుం బోసుకోమను. యిచ్చినోళ్లకొడుకు లెట్లా వసూలు జేసుకుంటారో— ఈ నాద్దికొడుకు ఎట్లా తీరస్తాడో మనం జూద్దాం!'

పుల్లమ్మ మాట్లాడేదు.

'ఛ! ఛ! మన వంశంలో అప్పుజేసి ఎరగం గదే! వానికి యీ బుద్ధి ఎట్లా పుట్టింది?'


'సెడు సావాసాలు! యీ పిల్లనాయాండ్లు అందరూ అట్లున్నారంట! ఆడోళ్లూ అంతే! సాంకేంద్రానికి పాలు బొయ్యటం! రోజూ మట్టాకు రాయటం! అబ్బో! అబ్బో! ఎంతాశ!'

'సావనీ నేను మాత్తరం తీర్చను!'

'అట్లంటే ఎట్లా? పదానా. ధర్మయ్య కొడుకు అప్పుజేసి చచ్చినాడంటే అపకీర్తి ఎవరికి? మనగ్గాదా? వాడు చస్తే మనం చూస్తావుంటామా? ఈ పొలం సంపాయించింది వాడికోసం గాదా! వాడు

ఏడబోతే ఈ ఆస్తి వాని పిల్లలకు యిస్తానన్నేదా నువ్వు.... నీకె పిల్లపోను ఉండన్ననాడు నువ్వేం జెప్పినావ్!

ధర్మయ్య మాట్లాడేడు. ఆతవి మనస్సులో పుట్టి బోయే తన మనవడు చిన్నధర్మయ్య మెదిలాడు. 'నా ఆస్తి వానికే!' అను కున్న మాటలు మళ్లీ



మనస్సులో మెదిలాయి.

'మనం మన కొడుకోసం కాదా కష్టపడింది. ఇప్పుడు వాని కొడుక్కోసం మనం ఎందుకు బిగించుకోవాలి! ముందు నా బిడ్డ సంగతి జూడు. వాడు చస్తే నేను పెద్ద కాలవలో దూకి చస్తా!'

'నీ ఎంట నేనూ దూకి చస్తా! ఆస్తి మనవని పేర్న రాస్తా!'

'ఎంతకపర్తిష్ఠ! అప్పుబో ల్లను ముంచిపోయినారని శోకం నున్నవాళ్లు మనల్ని ఆడిపోసుకుంటారు!'

ధర్మయ్య మాట్లాడేదు.

'నా మాటిను! మనకు ఏందైన పుణ్యం నువ్వేం జెప్పి నావ్! ఆస్తి సంపాయించా లన్నావు; మన పిల్లలను ఆస్తి పంతుల్ని జెయ్యాలన్నావు. వాడు నా కడుపున పడినాప్పుడు మన కడుపులు కట్టుకుని సంపాయిచ్చినాం గదా!'

చివ్వున తలెత్తి చూశాడు ధర్మయ్య. 'నా పానానికి పానంగా చూసుకుని పెంచినా! అట్ల వాడు పెరిగినాడు!

యిట్లా ఆస్తి పెరిగింది! పొలంగొన్నా! ఇప్పుడిట్లా తగిలెయ్యమంటావా!'

'ఏమి కర్మ! మనకు సుగపడే రాత లేదు. ఉంటే వాడు ఏరుబోకనే పోను! వా నోట్లో అప్పుడేం శనుండో! పంచ మన్నా!'

'అనుభవించినా గదా!'

'పోన్లేయే యస్సి! మనం మన బిడ్డ బతుకు చూసుకుందాం! వాణ్ణి బతికించుకుందాం! ఈసారి అగాయిత్యం యాడ చేస్తాడో! ఏమో! ఇంట్లోగాబట్టి అయి చూసి ఆ తిరుపతెంకన్న దయ- ఆ శ్రీశైలమల్లన్న దయతో బతికించుకున్నాం. అదే యాణ్ణో అయితే! శవం జూసిందుము!'

ధర్మయ్య గుండెల్లో దేవినట్లయింది ఆ మాట వినగానే!

'నా మాటినేం. అంతా యినుకున్నారు. రాంరెడ్డి పదేలకు వడ్డీ తీసుకుంటా నన్నాడు. చంద్రన్న రెండు వేలకు మెట్టచేను తీసుకుంటానన్నాడు. ఈ లెక్కలో మొత్తం అప్పులు వచ్చిన కాడికి తీసుకుంటామన్నారు. రూపాయకి పావలా! అవ్వ! దివాలా తీసినట్లు! ఏం కాలమొచ్చిందిరా బగవంతుడా!'

'అప్పుడే లెక్కలు గట్టినారా! నే నియ్యకపోతే!'

'అట్లంటే ఎట్లా! కడుపు చించుకుంటే కాళ్లమీద పడతాది! మనోడు- మన బిడ్డ- రామన్న వాని ముగం చూడు. కోడలు కడుపుతో వుంది. పుట్టబోయే మనవడిని జూడు! వాణ్ణి తండ్రిలేనోణ్ణి చేస్తవా!'

'నీకు తెలియదే! నా ఆస్తి పోతే నే బతకను!'

విట్టూర్చింది పుల్లమ్మ మెత్తబడుతున్న భర్త వైపు చూసింది ప్రేమగా, జాలిగా.

'నా మాటిను. తిరుపెల్లకు బోయి రిజిస్టర్ జేయించిరా!'

గింజుకున్నాడు ధర్మయ్య!

ఆఖరికి ఒప్పించింది పుల్లమ్మ.

* * *

రిజిష్టారు ఆఫీసుకు నడిచే పోయి నాడు. సంతకం జెయ్యలేడు గదా! ఏలి ముద్దరేసినాడు. గుండెల్లో నొప్పి అన్నాడు. బయటికి వచ్చి చెట్టుకింద కూర్చున్నాడు. ఒరిగిపోయినాడు. ఎంతలో అంతపో యింది. అయినా పాసం తెగ్గెడా పుట్టెడా? ఆ ధనం వస్తే అంతే!'

'నువ్వేన్నయినా జెప్పు-దర్మయ్యన్న ఆ ఆస్తిమీద అంత పానం పెట్టుకుని వున్నాడు. మనమంతా చెప్పితే ఆస్తి రాసిచ్చినాడు. లేకుంటేనా - అమ్మో! గిజగిజ గింజుకున్నా పిడికెడు మట్టి అయినా ముట్టుకోనిచ్చేవాడు కాదు!'

'ఆస్తికి మనిషికి ఎంత లంకె వుందింది! కొడుక్కన్నా బూమిని ఎక్కువ ప్రేమించినాడన్న.'

నలుగురూ నాలుగు రకాలుగా అనుకున్నారు ధర్మయ్య చావు గురించి.

ఆ మాటలన్నీ వింటుంది పుల్లమ్మ. ఆమె గుండె గుండం అయింది.

సీతకి పరమ దుఃఖంగా వుంది.

'ధనాను బంధం! అది తీరిపోతే ధన మయినా దక్కలేం!' అన్నారింకొకరు.

అది స్మశాన వైరాగ్యం.

'ఎంత కష్టపడినాడు! ఒక నిద్ర సుగ మెరగడు! ఒక తిండి సుగమెరగడు! ఒక మంచి బట్ట కట్టుకోలేదు. అంతా పైసాకి పైసా జతజేసినాడు. మట్టి పిసుక్కొని, ఆ మన్నుని బంగారం చేసుకున్నాడు!'

కొడుకు కొడుకని పలవరించినాడు. ఆకరికి పోయేప్పుడు కొడుకు లేడు. భార్య లేదు. అంతా మనమాయ!'

'ఎంత జేసినా ఆకరికి ఆ మన్నులో కలిసిపోయేవాళ్లమే! అయినా బతికి నన్నాళ్లా యావ వదదు!'

చుట్టూ చేరినోళ్లు తలాకరకంగా వ్యాఖ్యానిస్తున్నారు.

రామన్న మనసు మనసులో లేదు.

తనకోసం తండ్రి పానాలిడిచినాడు. ఆ కాలంలో రాముని కోసం దశరదుడు పానాలిచ్చినాడు. ఈనాడు తన కోసం తన తండ్రి పానాలిడిచినాడు. తను తన కొడుకుకోసం ఏంచేసినాడు? ఏంచేస్తాడు?

నాయన సంపాయించింది పోగొట్టి నాడు? ఇంకేమవుతుంది తనతో!

ఒక నిర్ణయానికి వచ్చాడు రామన్న.

'నాయనా! ఇది నాకు మల్లా జనమ! నేను మారిపోయినా. ఇయాలనుంచి కష్ట పడతా! సేద్దానికి పోతా! పైసకు పైస ముడిపెస్తా! నేనూ నా కొడుక్కోసం కష్టపడతా! నీలాగ పాణాలియ్యలేను! పాణానికి పాణంలాగా చూసుకుని ఆస్తి సంపాయిస్తా!'

ప్రతిజ్ఞలా అనుకున్నాడు రామన్న.

'తన మాటలు వినలేదు. తన బుద్ధి రాలేదు. పోనీ తన చావుతోనయినా వీడు మారిపోయినాడు అనుకుంటాడ్లే దర మయ్య!' అన్నారెవరో.

అతనివైపు వెలిగే కళ్ళతో చూశాడు రామన్న.

వారి కళ్ళల్లో ఉజ్జ్వల భవిష్యత్తు కనిపించింది సీతకి.

